క్లుప్తంగా

ఘనంగా ఓం శక్తి భక్తుల పూజలు



పూజలు చేస్తున్న భక్తులు

వెదురుకుప్పం: మండలంలోని పచ్చికాపల్లం పంచాయతీ బొమ్మన్‌దొడ్ల గ్రామంలో ఆదివారం ఓం శక్తి భక్తులు ఘనంగా పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆలయంలో అమ్మవారికి దూపదీప నైవేద్యాలు సమర్పించారు. అనంతరం అమ్మవారిని వివిధ రకాల పుష్పాలతో ఆకర్షణీయంగా అలంకరించారు. శనివారం రాత్రి అమ్మవారి గెరిగెను వైభవంగా ఊరేగించారు. ఆదివారం ఓంకారంతో కర్పూర జ్యోతిని వెలిగించి ఇరుముడులు తీసుకుని మేల్‌మరువత్తూరుకు పయనమయ్యారు. పది రోజులపాటు ఆరిమేని గంగమ్మ, నడివీధి గంగమ్మ ఆలయాల్లో ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. ఇందులో భాగంగా ఆలయంతో పాటు గ్రామంలో ఏర్పాటు చేసిన విద్యుద్దీపాలంకరణ ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.

కల్యాణ మండపం ప్రారంభం



సాయి సత్యవ్రతం నిర్వహిస్తున్న పండితులు

పుత్తూరు: పట్టణంలోని శ్రీషిరిడీ సాయిబాబా ఆలయ కల్యాణ మండపాన్ని ఆదివారం ఉదయం శాస్త్రోక్తంగా ప్రారంభించారు. ఉదయం 4.30 గంటలకు గోపూజ, ప్రవేశం, పాలు పొంగించారు. అనంతరం 9 గంటలకు గణపతి పూజ, సాయి సత్యవ్రతం నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీషిరిడీ సాయిబాబా నిత్య అన్నదాన సాంఘిక సేవా సమాజం అధ్యక్షుడు విజయకృష్ణ మాట్లాడుతూ భక్తులు ఇచ్చిన విరాళాలతో నిర్మించిన ఈ కల్యాణ మండపం ప్రజలకు ఎంతో ఉపయుక్తంగా ఉంటుందన్నారు. నామమాత్రపు అద్దె రూ.39 వేలు చెల్లించి పెళ్లిళ్లు చేసుకోవడానికి అవకాశం కల్పిస్తున్నట్లు తెలిపారు. సంఘ సభ్యులు, దాతలు, ప్రజలు పాల్గొన్నారు.

పట్టపగలే వెలుగుతున్న వీధిలైట్లు



వడమాలలో నిత్యం వెలుగుతున్న వీధిలైట్

వడమాలపేట(విజయపురం): విద్యుత్ వినియోగాన్ని తగ్గించి, నాణ్యమైన వెలుగులు అందించాలనే ఉద్దేశంతో ప్రభుత్వం ఎల్ఈడీ వీధి దీపాలను ఏర్పాటు చేసింది. అయితే క్షేత్రస్థాయిలో అధికారుల పర్యవేక్షణ లోపం కారణంగా వీధి దీపాలు, రాత్రీపగలు తేడా లేకుండా వెలుగుతున్నాయి. దీంతో విద్యుత్ బిల్లులు ఎక్కువగా వస్తున్నాయి. ఇది తెలిసి కూడా అధికారులు ఎవరూ పట్టించుకోవడం లేదని స్థానిక ప్రజలు మండిపడుతున్నారు. ఇప్పటికైనా మండల స్థాయి అధికారులు వీధి దీపాలకు ఆన్‌అండ్ ఆఫ్ స్విచ్‌లు ఏర్పాటు చేసి, విద్యుత్ ఆదా చేయాలని ప్రజలు కోరుతున్నారు.

ఉన్నత లక్ష్యం



ప్రభుత్వ డిగ్రీ కళాశాలలోనే చేరాలంటూ ర్యాలీ (ఫైల్)



కెమిస్ట్రీ ల్యాబ్

గ్రామీణ ప్రాంత విద్యార్థులకు ఉన్నత విద్యను అందించాలనే లక్ష్యంతో 1978లో ఎంజే మెహతా అనే దాత సాయంతో నగరిలో ప్రభుత్వ డిగ్రీ కళాశాలను నిర్మించారు. అప్పట్లో బీఎస్సీ, బీజెడ్‌సీ, బీకాం, బీఏ నాలుగు కోర్సులు మాత్రమే ఉండేవి. విద్యార్థులు ఇతర కోర్సులు చేయాలన్నా, డిగ్రీ పూర్తిచేసిన వారు పీజీ చేయాలన్నా ఆపై పీహెచ్‌డీ, ఎంఫిల్ చేయాలన్నా తిరుపతికి గానీ ఇతర సుదూర ప్రాంతాలకు గానీ వెళ్లాల్సి ఉండేది. ప్రభుత్వ సహకారంతో డిగ్రీ కళాశాల దినదినాభివృద్ధి చెందడంతో ప్రస్తుతం ఆ పరిస్థితి లేదు.

– నగరి

- దినదినాభివృద్ధి చెందుతున్న డిగ్రీ కళాశాల
- అకడమిక్ విద్యతోపాటు అదనపు కోర్సుల్లో ప్రత్యేక శిక్షణ
- డిగ్రీ నుంచి పీజీ, పరిశోధనా కేంద్రం నిర్వహించే స్థాయికి
- ఏడాది క్రితం వచ్చిన ప్రత్యేక హోదాతో మరింత మెరుగు

నగరి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రస్తుతం బీఎస్సీ(ఎంపీసీ), ఎంపీసీఎస్, ఎంఎస్‌సీఎస్, బీకాం, బీకాం (సీఏ), బీబీఏ, బీఏ(హెచ్‌ఈపీ), ఈపీసీఏ కోర్సులు అందుబాటులో ఉన్నాయి. పీజీలో ఎంకాం కోర్సును కూడా నగరి కళాశాలలోనే చదువుకోవచ్చు. ఏడాది క్రితం పరిశోధనా కేంద్రం కూడా నగరిలో ఏర్పాటు చేశారు. దీంతో పీహెచ్‌డీ, ఎంఫిల్ కోర్సులను కూడా విద్యార్థులు ఇక్కడే అభ్యసించే సదుపాయం కలిగింది. దీంతో ఇక్కడ విద్యను అభ్యసించిన పలువురు ఉపాధ్యాయులు, అధ్యాపకులు, న్యాయవాదులు, సాఫ్ట్‌వేర్ ఉద్యోగులు, ఛార్టర్డ్ అకౌంటెంట్స్, జర్నలిస్టులు, సైనికులు, పోలీసులు, ఆఫీస్ సిబ్బందిగా స్థిరపడి ఉన్నారు. ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్య వారికి ఎంతగానో ఉపయోగపడింది. 45 సంవత్సరాల క్రితం 152 మంది విద్యార్థులతో ప్రారంభమైన ఈ కళాశాలలో నేడు సుమారు 800 మంది విద్యార్థులు విద్యను అభ్యసిస్తున్నారు. ఉత్తీర్ణత గత ఐదేళ్లుగా 75 శాతానికి తగ్గకుండా ఉండడం కళాశాల స్థాయిని పెంచుతోంది. విశాలమైన ఆటస్థలం, అందుబాటులో ఉంది. జిమ్ విద్యార్థులలో క్రీడా నైపుణ్యాలను మెరుగుపరుచుకోవడానికి ఉపయోగ పడుతోంది. దీంతో అంతర్ కళాశాల, జోనల్ స్థాయిలో విద్యార్థులు క్రీడల్లో తమ ప్రతిభను కనబరుస్తున్నారు. దీంతో నగరి ప్రభుత్వ డిగ్రీ కళాశాల చిత్తూరు జిల్లాస్థాయిలో విద్యార్థుల సంఖ్యలో, ఉత్తీర్ణతలో రెండో స్థానంలో నిలిచి ఒక ప్రత్యేకస్థానాన్ని పొందింది. పరీక్షలు స్వయంగా నిర్వహించుకునే స్వయం ప్రతిపత్తి ఉన్న ప్రత్యేక హోదా కూడా గతేడాది కళాశాలకు దక్కింది.

అదనపు కోర్సులలో ప్రత్యేక శిక్షణ

యూనివర్సిటీ నిర్దేశించిన సిలబస్ మాత్రమే కాకుండా అదనంగా సర్టిఫికెట్ కోర్సులు, బ్రిడ్జ్ కోర్సులు, రెమిడీయల్ కోచింగ్, నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాలు, సెమినార్లు, క్విజ్ పోటీలు, గ్రూప్ డిస్కషన్స్, క్షేత్ర పర్యటనలు, ఐసీటీ ఆధారిత విద్యాబోధన, ఉన్నత విద్యా ప్రవేశాలకు ప్రత్యేక శిక్షణ అందిస్తున్నారు. కళాశాలలోనే జేకేసీ ద్వారా జాబ్ డ్రైవ్స్ నిర్వహించి ఉద్యోగావకాశాలు కల్పిస్తున్నారు. ఎన్నో జాబ్‌మేళాల ద్వారా విద్యార్థులకు ఉద్యోగ అవకాశాలు కల్పిస్తున్నారు.

విద్యా ప్రమాణాలు పెంచే విభాగాలు

- విద్యలో నాణ్యతను పెంపొందించే ఐక్యూఏసీ
- విద్యార్థులకు క్రమశిక్షణ అందించడంతోపాటు భవిష్యత్తు ఉద్యోగ, ఉన్నత విద్యావకాశాలు పొందడానికి ఉపయోగపడే ఎన్‌సీసీ
- సేవా దృక్పథాన్ని పెంపొందించడంతో పాటూ నాయకత్వ లక్షణాలను పెంపొందించడానికి ఎన్ఎస్ఎస్
- విద్యార్థుల్లోని నైపుణ్యాలను వెలికితీసే జిల్లా వనరుల అభివృద్ధి కేంద్రం(డీఆర్సీ)
- క్రమం తప్పకుండా రక్త దానం అందించే రెడ్ రిబ్బన్ క్లబ్ (ఆర్ఆర్‌సీ)
- నిత్యం కళాశాలను పచ్చగా ఉంచే ఎకో క్లబ్
- మహిళా సాధికారతను పెంపొందించే ఉమెన్ ఎంపవర్మెంట్ సెల్ తదితర విభాగాలు కళాశాల సామర్థ్యాన్నిపెంచుతున్నాయి. ఈ విభాగాలు నిర్వహించే జాతీయ భావాన్ని పెంచే కార్యక్రమాలు విద్యార్థుల ప్రమాణాలు పెంచడానికి తోడ్పడుతున్నాయి. ఈ విభాగాలు సక్రమంగా నిర్వహించేందుకు, అత్యుత్తమ విద్యను బోధించేందుకు 35 టీచింగ్, 15 నాన్ టీచింగ్ స్టాఫ్ ఉన్నారు. అధ్యాపకుల్లో అధికులు పీహెచ్‌డీతో పాటు నెట్/ఏపీసెట్/ఎంటెక్ చేసిన వారుండడం విశేషం. ఇక్కడి విద్యార్థులు పీహెచ్‌డీ, ఎంఫిల్ పట్టాలను కూడా సొంతం చేసుకున్నారు.



జేకేసీ ల్యాబ్

అధునాతన ప్రయోగశాలలు

అధునాతనమైన పరికరాలతో కూడిన బోటనీ, జువాలజీ, కెమిస్ట్రీ, ఫిజిక్స్, కంప్యూటర్ సైన్స్, కంప్యూటర్ అప్లికేషన్స్, నైపుణ్యాభివృద్ధి, జవహర్ నాలెడ్జ్ సెంటర్ ల్యాబ్‌లు నిత్యం విద్యార్థులకు అందుబాటులో ఉంటూ అనుభవాత్మక, ప్రయోగాత్మక విద్యా బోధనకు తోడ్పడుతున్నాయి.

నాణ్యమైన విద్యాబోధన



విద్యార్థులు పుస్తకాల్లోని పాఠాలతో పాటు ప్రపంచ జ్ఞానం కూడా అందేలా విద్యను బోధించాలన్న దృక్పథంతో విద్యతోపాటు ఇతర కోర్సుల్లోనూ ప్రత్యేక శిక్షణ అందిస్తున్నాం. సామాజిక బాధ్యత పెంపొందించే కార్యక్రమాలు, క్రీడల్లో ప్రోత్సాహం అందిస్తున్నాం. జాబ్‌మేళాలు నిర్వహించి ఉద్యోగ అవకాశాలు కల్పిస్తున్నాం. జాతీయ సదస్సులు నిర్వహిస్తున్నాం. ఉన్నత విద్యా కమిషన్ మార్గదర్శకాల ఫలితంగానే జిల్లాస్థాయిలో 2వ స్థానంలో ఉన్నాం. ప్రత్యేక హోదా సాధించాం. కళాశాలలోని వసతులను విద్యార్థులు వినియోగించుకోవాలి.

–డాక్టర్ ఆర్.వేణుగోపాల్, ప్రిన్సిపల్, నగరి డిగ్రీ కళాశాల

నత్తనడకన పిలాసపాలెం రోడ్డు పనులు



గులకరాళ్లతో పిలాసపాలెం రోడ్డు

విజయపురం: మండలంలోని పిలాసపాలెం తారు రోడ్డు నిర్మాణ పనులు నత్తనడకన సాగుతున్నాయి. 2008లో నాబార్డు నిధులు రూ.1.37 లక్షలతో సూరికాపురం రోడ్డు నుంచి పిలాసపాలెం రోడ్డుకు శంకుస్థాపన చేశారు. ఆ తరువాత పట్టించుకొనే నాథుడే కరువయ్యారు. 2019లో వైఎస్ఆర్ సీపీ అధికారంలోకి వచ్చాక అప్పటి మంత్రి ఆర్కే రోజా నిధులను తీసుకొచ్చారు. పనులు ప్రారంభించిన తరువాత ఎన్నికలు రావడంతో పనులు ఆగిపోయాయి. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఎనిమిది నెలలైంది. నిధులు ఉన్నా పనులు నత్తనడకన సాగుతున్నాయి. గులకరాళ్ల రోడ్డుపై మూగజీవులు, పాదచారులు, ద్విచక్ర వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. పనులు వేగవంతం చేయాలని కోరుతున్నారు

ఉద్యోగ భద్రత కల్పించాలి



ఏఐటీయూసీ ఆధ్వర్యంలో ర్యాలీ

శ్రీరంగరాజపురం: కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో కార్మికులకు ఇచ్చిన హామీలను వెంటనే నెరవేర్చాలని ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు నాగరాజు అన్నారు. గంగాధరనెల్లూరు నియోజకవర్గం అధ్యక్షుడు గోవిందస్వామి ఆధ్వర్యంలో ఆదివారం మండల కేంద్రం నుంచి పుల్లూరు క్రాస్ వరకు కార్మికులతో కలసి ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా నాగరాజు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఏర్పడి ఏడు నెలలు అవుతున్నా ఇంత వరకు కార్మికులకు ఇచ్చిన హామీలను నెరవేర్చడం లేదన్నారు. వెంటనే ఆశ, అంగన్‌వాడీ, స్కూల్ ఆయాలకు ఉద్యోగ భద్రత కల్పించాలన్నారు. బిల్డింగ్ కార్మికుల సంక్షేమ బోర్డును కూటమి ప్రభుత్వం నిర్వీర్యం చేస్తోందన్నారు. అర్హులైన ప్రతి కార్మికుడికి 3 సెంట్లు స్థలం కేటాయించి ఇళ్లు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. జిల్లా కార్యదర్శి కోదండయ్య, ఆటో యూనియన్ కార్యదర్శి మోహన్, రాధమ్మ, కోకిల, నిర్మల, మురళి, హరి, గజేంద్ర, కుప్పయ్య, మంజుల, ఇంద్రాణి, చిన్నబ్బ తదితరులు పాల్గొన్నారు.

ప్రజా వ్యతిరేక విధానాలను తిప్పికొట్టాలి



సమన్వయకర్త కృపాలక్ష్మిని కలిసిన నేతలు

- వైఎస్ఆర్ సీపీ శ్రేణులకు సమన్వయకర్త కృపాలక్ష్మి పిలుపు

వెదురుకుప్పం: కూటమి ప్రభుత్వం అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను తిప్పికొట్టేందుకు సన్నద్ధమవ్వాలని వైఎస్ఆర్ సీపీ గంగాధరనెల్లూరు నియోజకవర్గ సమన్వయకర్త కె.కృపాలక్ష్మి సూచించారు. ఆదివారం పుత్తూరు క్యాంపు కార్యాలయంలో గంగాధరనెల్లూరు వైఎస్ఆర్ సీపీ మహిళా అధ్యక్షురాలిగా నియమితులైన వెదురుకుప్పం ఎంపీటీసీ సభ్యురాలు రాధిక, పార్టీ శ్రేణులతో కలిశారు. ఈ సందర్భంగా కృపాలక్ష్మి నాయకులనుద్దేశించి మాట్లాడారు. వైఎస్ఆర్ సీపీకి పూర్వ వైభవం తీసుకొచ్చేందుకు అందరూ సహకరించాలని తెలిపారు. క్షేత్ర స్థాయిలో పార్టీ బలోపేతానికి కష్టపడి పని చేయాలన్నారు. ప్రభుత్వ వ్యతిరేక విధానాలను ప్రజల్లోకి తీసుకెళ్లి పోరాటాలు చేసేందుకు సిద్ధమవ్వాలని సూచించారు. పేదలకు న్యాయం జరగాలంటే అది ఒక్క జగనన్నతోనే సాధ్యమన్న విషయాన్ని ప్రజలు కూడా విశ్వసిస్తున్నట్లు పేర్కొన్నారు. 5వ తేదీన జరిగే ఫీజు పోరుకు ఆరు మండలాల నుంచి ఉవ్వెత్తున ఎగిసిపడేలా తరలివచ్చి ప్రభుత్వం మెడలు వంచాలన్నారు. అనంతరం కృపాలక్ష్మిని ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో పెరుమాళ్లపల్లె ఎంపీటీసీ తోకల మురళీరెడ్డి, మాజీ సర్పంచ్‌లు చిరంజీవి రెడ్డి, రమేష్‌రెడ్డి, భాస్కర్‌రెడ్డి, పురందర్‌రెడ్డి పాల్గొన్నారు.

సిద్ధుల పీఠానికి కూరగాయలు



లారీని పంపుతున్న ఆదిపరాశక్తి మందిర అధ్యక్ష, కార్యదర్శులు

నగరి: తమిళనాడులోని మేల్‌మరువత్తూరు ఆదిపరాశక్తి ఆలయానికి కూరగాయలు వితరణగా అందించారు. ఆడిపురం శక్తి మాల పర్వదిన ఉత్సవాల సందర్భంగా నగరి, తిరుపతి పుత్తూరు, పరిసర ప్రాంతాల ఆదిపరాశక్తి భక్తులు 10 టన్నుల కాయగూరలు వితరణగా అందించారు. ఆదివారం కూరగాయలతో కూడిన లారీలు నగరి ఓం శక్తి ఆలయం నుంచి బయల్దేరాయి. మేల్‌మరువత్తూర్ సిద్ధుల పీఠంలో నిర్వహించే నిత్యాన్నదాన కార్యక్రమానికి ఈ కూరగాయలు పంపుతున్నట్లు ఓం శక్తి ఆధ్యాత్మిక కమిటీ జిల్లా అధ్యక్షుడు గంగాధర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో తిరుపతి, పుత్తూరు, నగరి, కుప్పం ఆదిపరాశక్తి మందిరం అధ్యక్ష, కార్యదర్శులు పాల్గొన్నారు.

దేవయ్య సేవలు ఆదర్శనీయం



దేవయ్య దంపతులను సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

కార్వేటినగరం: ఉపాధ్యాయుడిగా, సంఘ నాయకుడిగా వివిధ హోదాల్లో పని చేసిన దేవయ్య సేవలు నేటి తరం ఉపాధ్యాయులకు ఆదర్శనీయమని రాష్ట్ర ఉపాధ్యాయ సంఘం(ఎస్టీయూ) రాష్ట్ర నేత గాజుల నాగేశ్వరరావు అన్నారు. ఆదివారం ఆర్కేవీబీ పేట ఉన్నత పాఠశాలలో విధులు నిర్వహిస్తూ పదవీ విరమణ పొందిన దేవయ్య సన్మాన కార్యక్రమాన్ని హెచ్ఎం అరుణ ఆధ్వర్యంలో నిర్వహించారు. సన్మాన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొన్న రాష్ట్ర నేత గాజుల నాగేశ్వరరావు మాట్లాడుతూ ఉపాధ్యాయుడిగా, సంఘ నాయకుడిగా దేవయ్య సేవలను కొనియాడారు. ఎంఈఓ ఎం.విజయకుమార్, పాఠశాల కమిటీ చైర్మన్ సాంబశివ ఆచారి మాట్లాడుతూ విద్యార్థులు, తల్లిదండ్రులకు కుటుంబ పెద్దగా స్నేహితుడిగా, మార్గదర్శకుడిగా ఆయన సేవలు మరువలేమని తెలిపారు. ఎస్టీయూ కార్యదర్శి హేమచంద్రారెడ్డి, జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి మదన్‌మోహన్‌రెడ్డి, మోహన్, యువరాజు, యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ఎస్ఎస్ నాయుడు, జిల్లా అధ్యక్షుడు కిరణ్, పీఆర్టీయూ గురుమూర్తి,డైట్ అధ్యాపకుడు చెంగల్‌రాజు, యూటీఎఫ్ నాయకులు వేణుగోపాల్, రాబర్ట్, సహదేవ నాయుడు, దేవరాజులురెడ్డి, వెంకటేష్, గుర్రప్ప, సెల్వం తదితరులు పాల్గొన్నారు.

నేడు ఉపాధి హామీ బహిరంగ సభ

శ్రీరంగరాజపురం: ఉపాధి హామీ బహిరంగ సోషియల్ ఆడిట్ సభను సోమవారం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ మోహన్‌మురళి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2023 నుంచి 2024 వరకు ఉపాధి హామీ పనులకు సంబంధించిన వివరాలను బహిరంగ ఆడిట్ సభను మండల కేంద్రం వద్ద ఉదయం 10 గంటలకు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఉపాధిహామీ పనుల్లో ఎవరికైనా సందేహాలు ఉంటే బహిరంగ ఆడిట్‌లో పాల్గొనాలని కోరారు.

సేంద్రియం.. ఆదాయం

- ప్రకృతి వ్యవసాయతో రైతులకు ఖర్చు ఆదా
- సేంద్రియ సాగులో ఆరోగ్యకరమైన పంట ఉత్పత్తులు
- రసాయన ఎరువులతో పెట్టుబడులు రెట్టింపు



సేంద్రియ సాగులో ఉన్న వరిపొలం





గోవు పేడ, ఘన జీవామృతంపై రైతులకు అవగాహన కల్పిస్తున్న అధికారులు, వరిపంటపై పిచికారీ చేసే కషాయంపై అవగాహన

వ్యవసాయంలో రసాయన ఎరువుల వినియోగంతో లాభాల కంటే నష్టాలే అధికంగా ఉంటున్నాయి. భూమిలో పంటల ఎదుగుదలకు ఉపయోగపడే సూక్ష్మజీవులు చనిపోయి, భూమి సారం కోల్పోతోంది. పర్యావరణానికి కూడా హానికరంగా మారుతోంది. ఈ ఉత్పత్తులను తీసుకోవడంతో ఆరోగ్యంపై కూడా తీవ్ర ప్రభావం చూపుతున్నాయి. అదే సేంద్రియ సాగులో ఇలాంటి నష్టాలు ఉండవు. నేల ఉత్పాదకత, భూసారం నిలకడగా ఉంటుంది. పంటలో నాణ్యత పెరుగుతుంది. పెట్టుబడులు తగ్గుతాయి. ఆరోగ్యకర ఉత్పత్తులు పొందవచ్చు. –పాలసముద్రం

నగరి డివిజన్‌లో సేంద్రియ పద్ధతిలో పంటలు సాగు చేస్తున్న రైతులు 5001 మంది ఉన్నారు. ప్రస్తుతం 5151 ఎకరాల్లో సేంద్రియంగా సాగు చేయాల్సి ఉంటే అందులో 3276 ఎకరాల్లో ప్రకృతి వ్యవసాయం చేస్తున్నారు. నీరు సమృద్ధిగా లభించే రైతులు పంటల సాగులో సేంద్రియ పద్ధతులను అవలంభిస్తున్నారు. సాధారణంగా వ్యవసాయంలో రసాయన ఎరువులు, పురుగు మందుల వినియోగం ఎక్కువైంది. వాటి ధరలు ఎక్కువగా ఉండడంతో పెట్టుబడి రెట్టింపు అవుతోంది. భూమి కూడా సారం కోల్పోతోంది. ఏటా దిగుబడులు కూడా తగ్గిపోతున్నాయి. దీని కారణంగా ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం పడుతోంది. ఇలాంటి పరిస్థితుల్లో సేంద్రియ, ప్రకృతి వ్యవసాయం వైపు అడుగులు వేయాల్సిన అవసరం ఉంది. సేంద్రియ సాగుకు ప్రభుత్వాలు కూడా ప్రోత్సాహం అందిస్తున్నాయి.

లాభాలు అనేకం

- నేల, నీరు, వ్యవసాయ ఉత్పత్తులు కాలుష్యానికి గురికావు. సేంద్రియ ఎరువుల వినియోగం పెరగడంతో మొక్కకు అవసరమైన ఉప సూక్ష్మపోషకాలు తగిన మోతాదులో అందుతాయి. చీడపీడల తాకిడి తగ్గుతుంది. ఆరోగ్యానికి, కాలుష్య నివారణకు దోహదపడుతుంది.
- నీరు పట్టి ఉంచుకునే శక్తి పెరుగుతుంది. వేర్లు బాగా భూమిలోకి చొచ్చుకుని పోయే లక్షణం కలిగి ఉంటుంది. భౌతిక లక్షణాలు వృద్ధి చెందుతాయి. మొక్కకు పోషకాలు బాగా అందుతాయి. వ్యవసాయ సుస్థిరత పెరుగుతుంది. సురక్షిత ఆహారం అభిస్తుంది.
- ఆహారంలోకి విష పదార్థాలు ప్రవేశించే అవకాశం ఉండదు. ఖరీదైన పెట్టుబడులు పెట్టాల్సిన అవసరం లేదు. నేల ఉత్పాదకత భూసారం పుష్కలంగా అందుతుంది. పంటలో నాణ్యత పెరుగుతుంది.

యాజమాన్య పద్ధతులు

సేంద్రియ వ్యవసాయానికి గోవుల పేడ, వేపసారం అవసరం. నేల కోతకు గురికాకుండా జాగ్రత్త పడాలి. నేల–నీటి సంరక్షణ చర్యలు చేపట్టాలి. పంట మార్పిడి తప్పనిసరిగా పాటించాలి. అనువైన అంతర పంటలు వేయాలి. పచ్చిరొట్ట పైర్లకు, పచ్చి ఆకు రొట్టకు ప్రాధాన్యం ఇవ్వాలి. వ్యవసాయ వ్యర్థాలను సమర్థవంతంగా ఉపయోగించడం కీలకం,

- పూర్తిగా కుళ్లిన సేంద్రియ ఎరువుల వాడకం, పరిశుభ్రమైన సాగు, సకాలంలో కలుపు నివారణ జరగాలి. సేంద్రియ ఎరువులు, జీవన ఎరువులు విరివిగా వాడడం ముఖ్యం. సాగునీటి యాజమాన్యంపై దృష్టి పెట్టాలి.

ఉపయోగకరం



సేంద్రియ సాగుతో అనేక ప్రయోజనాలు ఉన్నాయి. రసాయన ఎరువుల వాడకంతో భూమి సారం కోల్పోతుంది. దీనివల్ల దిగుబడి కూడా తగ్గిపోతుంది. కొన్నిసార్లు కనీసం పెట్టుబడి కూడా రాదు. అందువల్ల తక్కువ పెట్టుబడితో సాధ్యమయ్యే సేంద్రియ వ్యవసాయ సాగుపై దృష్టి పెట్టాం.

-కె.కేశవన్, సీఎం కండ్రిగ, సేంద్రియ రైతు

సాగు ఖర్చు తక్కువ



సేంద్రియ సాగులో నాలుగు మాసాలు పంటకాలం ఉంటుంది. ఎకరాకి మూడు పుట్ల దిగుబడి వస్తుంది. ఎకరాకి రూ.15 వేల నుంచి రూ.20 వేలు వరకు సాగు ఖర్చు అవుతుంది. అదే రసాయన ఎరువులు వినియోగిస్తే రూ.40 వేలు అవుతుంది. ఖర్చు ఎక్కువ అవుతుండడంతో సేంద్రియ సాగుపై దృష్టి సారిస్తున్నాం.

– ప్రతాప్, ఎస్ఎఫ్ఎంటీ

సేంద్రియ సాగు చేయాలి



రసాయన ఎరువులతో భూమి సారం తగ్గిపోతుంది. రైతులు సేంద్రియ సాగుపై దృష్టి సారించాలి. పంట మార్పిడితో రైతులకు ఆర్థిక దన్ను ఉంటుంది. శాస్త్రవేత్తల సూచనల మేరకు పురుగు మందులు వాడాలి. అప్పుడే భూమి సారవంతంగా ఉంటుంది. ఖర్చులు తగ్గాలంటే సేంద్రియ వ్యవసాయం చేయాలి.

-వాసు, డీపీఎం

పదికి ప్రత్యేక తరగతులు



ఎం.కొత్తూరు పాఠశాలలో ప్రత్యేక తరగతులు

నగరి: పదో తరగతి చదివే విద్యార్థులకు పరీక్షలు సమీపిస్తుండడంతో ప్రభుత్వ పాఠశాలల్లో ఆదివారం కూడా ప్రత్యేక తరగతులు నిర్వహించారు. విద్యార్థులకు సందేహాలు నివృత్తి చేయడం, పాఠ్యాంశాలు పునరావృతం చేస్తూ విద్యార్థులకు అవగాహన కల్పించారు. పాఠశాలలోనే వారికి మధ్యాహ్న భోజనం కూడా వడ్డించారు.

అంతరాయం లేకుండా విద్యుత్ సరఫరా

గుడిపాల: విద్యుత్ సరఫరాలో అంతరాయం లేకుండా చూస్తామని ట్రాన్స్‌కో ఎస్ఈ ఇస్మాయిల్ అహ్మద్ అన్నారు. ఆయన ఆదివారం కొత్తపల్లె, సీకే పల్లె సబ్ స్టేషన్‌లను ఆయన పరిశీలించారు. ఎస్ఈ మాట్లాడుతూ 132 కేవీ లైన్ మార్పుల్లో గుడిపాల మండలానికి ప్రత్యామ్నాయంగా ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు.